ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5

జయశంకర్
భూపాలపల్లి
ములుగు

ఆదివారం 30 జూన్ 2024



హనుమకొండ హంటర్‌రోడ్డులో మెడికవర్ మల్టీ నేషనల్ ఆస్పత్రిని శనివారం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రాన్ని మెడికల్ హబ్‌గా అభివృద్ధి చేస్తామని.. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన హైదరాబాద్ విశ్వనగరంగా గుర్తింపు పొందిందని, ఆ మాదిరిగానే వరంగల్‌నూ రూపుదిద్దుతామన్నారు. ప్రతీ పౌరుడికి హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి, యూనిక్ నెంబరుతో డిజిటల్ కార్డులు ఇచ్చి.. తద్వారా ఏ ఆస్పత్రిలోనైనా ఉచితంగా చికిత్స పొందేలా కార్యాచరణ రూపొందిస్తామన్నారు. హెల్త్, ఎడ్యుకేషన్, ఎకో, టెంపుల్ టూరిజం అన్నీ ఒక వరంగల్‌లోనే అభివృద్ధి చేసుకునే అవకాశాలున్నాయన్నారు.



నగర అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి

నగర సమగ్రాభివృద్ధికి మాస్టర్ ప్లాన్



సమీక్షలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్‌కు దీటుగా అభివృద్ధి చేస్తాం

- ఇందుకు రూ.6,115కోట్లు అవసరమని అంచనా
- రింగ్ రోడ్డు, మామునూరు విమానాశ్రయానికి భూసేకరణ చేపట్టండి
- అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీకి డీపీఆర్ సిద్ధం చేయాలి
- నిమ్స్ తరహాలో ఎంజీఎంలో ఎన్‌వోసీల అమలుకు యోచన
- నగరాభివృద్ధిపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- వివిధ శాఖల అధికారులకు దశ దిశా నిర్దేశం
- నిర్లక్ష్యం చేస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరిక
- వరంగల్, హనుమకొండ జిల్లాల్లో సీఎం విస్తృత పర్యటన



హనుమకొండ కలెక్టరేట్‌లో మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్, చిత్రంలో మంత్రులు

హనుమకొండ, జూన్ 29 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తామని, నగరాన్ని హైదరాబాద్‌కు దీటుగా మరో విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటామని, ఈ దిశగా తానే స్వయంగా ప్రత్యేక దృష్టి పెడతానని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. శనివారం వరంగల్, హనుమకొండ జిల్లాల పర్యటనకు వచ్చిన ఆయన మధ్యాహ్నం 01.10 గంటకు హెలికాప్టర్‌లో గీసు కొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ ఫ్యాక్టరీకి చేరుకున్నారు. ఆ తర్వాత వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పను లను పరిశీలించి.. హనుమకొండ కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఇందిరమ్మ మహిళా శక్తి క్యాంటీన్లను ప్రారంభించిన అనంతరం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరంగల్ నగరాభివృద్ధికి సంబంధించిన ఎనిమిది అంశాలపై మూడున్నర గంటల పాటు సుదీర్ఘంగా అన్ని విభాగాల అధికారులతో సమీక్ష జరిపారు. అయితే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నగర సమస్యలపై ఇంత సుదీర్ఘంగా సమీక్ష జరపడం ఇదే మొదటి సారి. ఈ సందర్భంగా అయన రింగ్ రోడ్డు నిర్మాణం, స్మార్ట్ సిటీ పనులు, అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ, మామునూరు విమానాశ్రయం, కాళోజీ కళాక్షేత్రం, సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి, తదితర అంశాలపై క్షుణ్ణంగా చర్చించారు. ఈ సందర్భంగా నగరాభివృద్ధికి తీసుకోవలసిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారుల ను ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నగర సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎప్పుడైనా తనను కలవవచ్చునని అన్నారు. ఈ క్రమంలో హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య రింగ్ రోడ్డుపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. రెండు చోట్ల 13 కిలోమీటర్ల వరకు చేపట్టనున్న రింగ్ రోడ్డు నిర్మాణానికి తొలుత సత్వరమే భూసేకరణ చేపట్టాలని, ఆ తర్వాతే నిర్మాణ పనులను చేపట్టాలని, వరంగల్ నుంచి ఇతర జిల్లాలకు రవాణా సౌకర్యం మెరుగుపడేలా జాతీయ రహదారుల అనుసంధానాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. భారీ వర్షాలు కురిసినప్పుడు వరంగల్‌లో కాలనీలు మునుగుతున్నాయని, ఈ సమస్య శాశ్వత పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రైయినేజీ నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టాలని, నాలాల ఆక్రమ ణపై దృష్టి సారించాలని అన్నారు. నాలాల్లో ఇసుక ఎప్పటికప్పుడు తొల గించాలని.. హైదరాబాద్ నగరంలో అవలంబిస్తున్న కొత్త పద్ధతులను వరంగల్‌లోనూ ప్రయోగించాలని

మిగతా 7వ పేజీలో..





టెక్స్‌టైల్ పార్కులో కంపెనీ ఛాయాచిత్రాన్ని పరిశీలిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంపై అధికారులతో మాట్లాడుతున్న సీఎం

ధరణి దరఖాస్తులను పరిష్కరించాలి

సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్

భూపాలపల్లి కలెక్టరేట్/జూన్ 29: పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించాలని సీసీఎస్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ కలెక్టర్లను ఆదేశించారు. హైదారాబాద్ నుంచి ఆయన శనివారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. భూపాలపల్లి నుంచి కలెక్టర్ రాహుల్ శర్మ, ములుగు నుంచి దివాకర పాల్గొన్నారు.ఈసందర్భంగా నవీన్ మిట్టల్ మాట్లాడుతూ జిల్లాల్లో ధరణి దరఖాస్తులు ఎక్కువగా తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలోనే ఎక్కువ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వారం రోజుల్లో వాటిని పరిష్కరించాలన్నారు. జూన్ 15 నుంచి 28 వరకు పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి తీసుకున్న చర్యలపై కలెక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఎన్ఆర్ఐ పట్టా పాస్‌పుస్తకం, కోర్టుకేసు, కోర్టు వివాదంలో ఉన్న పట్టా పాస్‌పుస్తకం, డేటా కరెక్షన్, జీపీఏ, ప్రొహిబిటెడ్ ప్రాపర్టీ, నూతన పట్టా పాస్‌పుస్తకం జారీ, నాలా, ఖాతా మెర్జింగ్, భూ సంబంధిత ఫిర్యాదులు, నాలా పీపీబీ, పెండింగ్ మ్యూటేషన్, సక్సెషన్, అర్బన్ ల్యాండ్ తదితర అంశాలపై వచ్చిన దరఖాస్తులను పరిష్కరిం చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. అందుబాటులో ఉన్న రికార్డులను పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారణ చేసిన తర్వాత ధరణి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేసి డిస్పోజ్ చేయాలన్నారు. అలాగే జిల్లాల్లో కొత్తగా నిర్మిస్తున్న పాఠశాలలు, కాలేజీలకు స్థలాలను సేకరించాలన్నారు. నిర్మించబోతున్న పాఠశాలలు, కాలేజీలకు స్థల సేకర ణచేయాలన్నారు. ఈ సందర్భంగా భూపాలపల్లి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 12 మండలాల్లో వివిధ కారణాలతో 1,826 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. సమీకృత గురుకుల పాఠశాలల కాంప్లెక్స్ కోసం గణపురం మండలం మైలారం గ్రామశివారులో 40 ఎకరాల స్థలాన్ని కేటాయించినట్లు వివరించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో భూపాలపల్లి అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, భూపాపల్లి, ములుగు ఆర్డీవోలు మంగిలాల్, సత్య పాల్‌రెడ్డి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

గణాంక దర్శిని పుస్తక ఆవిష్కరణ

గణాంకాల పితామహుడు ప్రశాంత చంద్ర మహలనోబిస్ జన్మదినం పురస్కరించుకొని జిల్లా గణాంక దర్శని పుస్తకాన్ని భూపాలపల్లి కలెక్టరేట్‌లో కలెక్టర్ రాహుల్ శర్మ ఆవిష్కరించారు. అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సీపీవో శామ్యూల్, ఏఎస్‌వోలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

మంత్రి సీతక్క



సమీకృత భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క

ములుగు కలెక్టరేట్, జూన్ 29: ములుగు జిల్లాకేంద్రంలో చేపడుతున్న మెడికల్ కళాశాల, సమీకృత కలెక్టర్ కార్యాలయ భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షే మ శాఖ మంత్రి ధనసరి సీతక్క సంబంధిత శాఖ అధికారులను ఆదేశిం చారు. కలెక్టర్ టి.ఎస్.దివాకరతో కలిసి మెడికల్ కళాశాల, సమీకృత కలెక్టర్ కార్యాలయ నిర్మాణ పనులను శనివారం క్షేత్రస్థాయిలో మంత్రి పరిశీలించారు. భవన నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, అవసరమైతే అదనంగా కార్మికులను నియమించుకుని పనులను నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పూర్తి చేయాలన్నారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయ నిర్మాణ పనులను డిసెంబరులోగా పూర్తిచేసి అధికారులకు అందించాలని అన్నారు. మెడికల్ కళాశాలలో ఎన్ని కోర్సులు అందుబాటులో ఉన్నాయి, ఎంతమంది విద్యార్థులు వచ్చే అవకాశం ఉంది, వారికి అందించే సదుపాయాలు ఎలా ఉంటాయి? తదితర అంశాలను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌లాల్‌ను అడిగి తెలుసుకున్నారు. మంత్రి వెంట ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్, ఆర్అండ్‌బీ అధికారులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

జడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ




అధికారుల నుంచి సమాచారాన్ని తెలుసుకుంటున్న జడ్పీ వైస్ చైర్‌పర్సన్ కళ్లెపు శోభ

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 29: అధికారులు ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా పరిషత్ వైస్ ఛైర్‌పర్సన్ కళ్లెపు శోభ అన్నారు. జడ్పీ కార్యాలయంలో సీఈవో విజయలక్ష్మి అధ్యక్షతన శనివారం జరిగిన ఏడు స్థాయీ సంఘాల సమావేశానికి ముఖ్య అతిథిగా శోభ హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ శాఖల

మిగతా 8వ పేజీలో...





హనుమకొండ సిటీ, జూన్ 29: డీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలోని సహకార సంఘాలు ఆర్థిక బలోపేత మార్గాలను అన్వేషించాలని తెలంగాణ రాష్ట్ర కో-ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టెస్కాబ్) ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు సూచించారు. శనివారం హనుమకొండ నక్కలగుట్టలోని డీసీసీ బ్యాంకు ప్రధాన కార్యాలయంలో రవీందర్‌రావు అధ్యక్షతన మహాజన సభ జరిగింది. సభలో బ్యాంకు లావాదేవీలు, అప్పులు, రుణాల మంజూరు, రికవరీ, భవిష్యత్తు ప్రణాళికలు, బ్యాంకు టర్నోవర్ లక్ష్యం తదితర అంశాలను ప్రస్తావించారు. మహాజన సభనుద్దేశించి మార్నేని రవీందర్‌రావు మాట్లాడుతూ.. సహకార సంఘాలు ఆర్థికంగా మరింత బలోపేతం అయితే సేవల విస్తరణ జరుగుతుందన్నారు. ఫలితంగా నూతనంగా ఏర్పర్చుకున్న ప్రగతి లక్ష్యాల సాధన జరుగుతుందన్నారు. సహకార సంఘాల పరిధిలోని రైతుల అవసరాలే కాకుండా ఆయా ప్రాంతాల్లోని ప్రజల అవసరాలను గుర్తించి ఆ మేరకు వ్యాపారాలు నిర్వహిస్తే ఆర్థిక ఫలితాలుంటాయన్నారు. ఎప్పటికప్పుడు ఆర్థికంగా జరుగుతున్న మార్పులను పరిశీలించుకొని ఆ మేరకు ఆయా ప్రాంతాల ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకొని సంఘాలు వ్యాపారాల నిర్వహణను విస్తరించుకోవాలని సూచించారు. సంఘాలు వ్యాపార నిర్వహణపై దృష్టి పెడితే అనేక మార్గాల్లో ఫలితాలను సాధించవచ్చన్నారు. విత్తనాలు, ఎరువుల విక్రయాలే కాకుండా గ్యాస్ ఏజెన్సీలు, మాల్స్ నిర్వహణ, జెనరిక్ మెడికల్ షాప్స్, పెట్రోలు పంపులు, ఫంక్షన్ హాల్స్ ఇలా ఎన్నో వ్యాపారానికి అనువుగా ఉంటాయన్నారు. వీటిని పరిశీలించి అధ్యయనం చేసి ప్రారంభిస్తే తప్పక ఫలితాలు ఉంటాయన్నారు. తద్వారా సహకార సంఘాలు ఆర్థికంగా బలోపేతం అవుతాయన్నారు.

డీసీసీ బ్యాంకు టర్నోవర్ రూ.2200 కోట్ల లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు మార్నేని రవీందర్‌రావు వెల్లడించారు. ప్రస్తుతం రూ.1930 టర్నోవర్‌ను సాధించినట్లు చెప్పారు. కమర్షియల్ బ్యాంకులతో పాటు రుణాల మంజూరులో బ్యాంకు పోటీ పడుతుందన్నారు. అన్ని వర్గాల వారికి రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. ప్రగతి సాధనలో భాగంగా 50 సహకార సంఘాలు ఆర్థికంగా వృద్ధి సాధించాయని, ఇంత సంఖ్యలో సంఘాలు బలపడడం ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే జరిగిందన్నారు. సి-గ్రేడ్‌లో ఉన్న సంఘాలు బి నుంచి ఏ, ఏ-1 స్థాయికి చేరాయని వివరించారు. అయితే ప్రస్తుతం సి-గ్రేడ్‌లో ఉన్న సంఘాలు కూడా తమ ఉన్నతిని పెంచుకొని పోటీతత్వాన్ని ప్రదర్శించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రైతులకు ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీసీసీ బ్యాంకు ద్వారా 78,432మంది రైతులకు లబ్ధి చేకూరనున్నట్లు రవీందర్‌రావు వెల్లడించారు. రుణమాఫీ ద్వారా ఉమ్మడి వరంగల్‌లో మొత్తంగా రూ.522కోట్ల రుణాలు మాఫీ కానున్నట్లు చెప్పారు. బ్యాంకు అధికారుల సమర్పించిన రైతుల రుణమాఫీ వివరాలను ప్రభుత్వానికి ఇప్పటికే ప్రతిపాదించినట్లు చెప్పారు. ఇందులో లోపాలు తలెత్తితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని రవీందర్‌రావు స్పష్టం చేశారు.

అనంతరం బ్యాంకు ప్రగతి నివేదికను రవీందర్‌రావు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో డీసీసీ బ్యాంకు వైస్ ఛైర్మన్ కుందూరు వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్లు కంది శ్రీనివాస్‌రెడ్డి, ఉపేందర్‌రెడ్డి, హరిప్రసాద్, మురళీధర్, రాజేశ్వర్‌రెడ్డి, రమేశ్, రంజిత్, గోపాలరావు, శ్రీనివాస్, రవిరాజా, నరేందర్, ప్రదీప్‌చందర్, డీసీసీ బ్యాంకు సీఈవో వాజిర్ సుల్తాన్, డీసీవోలు తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాలు ఆర్థిక మార్గాలను అన్వేషించాలి..

డీసీసీ బ్యాంకు మహాజన సభలో టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు


సభలో మాట్లాడుతున్న మార్నేని రవీందర్‌రావు







భద్రకాళి ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తాం..

రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ హన్మంతరావు


మాడవీధుల ప్లాన్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ హన్మంతరావు

వరంగల్ కల్చరల్, జూన్ 29: చారిత్రక ప్రసిద్ధిగాంచిన భద్రకాళి ఆలయ అభివృద్ధి, మాడవీధుల నిర్మాణ పనులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కమిషనర్ మంత్రి ప్రగడ హన్మంతరావు అన్నారు. శనివారం వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని సందర్శించారు. ముందుగా కమిషనర్‌కు ఆలయ అర్చకులు, ఈవో శేష భారతి, ప్రధానార్చకుడు భద్రకాళి శేష మంగళ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. కమిషనర్ గోశాలను సందర్శించి ఆదిశంకరాచార్యులు, వల్లభ గణపతిని దర్శించుకున్న అనంతరం భద్రకాళి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మహా మండపంలో కమిషనర్ హన్మంతరావుకు ప్రధానార్చకుల ఆధ్వర్యంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రాలను బహూకరించి ప్రసాదాలు అందజేశారు.

అనంతరం రూ.30కోట్లతో భద్రకాళి ఆలయ అభివృద్ధి మాడవీధుల నిర్మాణ పనులపై ఆయన అర్చకులతో చర్చించారు. మాడవీధుల పనులు ప్రారంభం కాగా, భద్రకాళి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రూపొందించామని దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు వివరించారు. ఆలయ అభివృద్ధి కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌ను కమిషనర్ హన్మంతరావు పరిశీలించారు. ప్లాన్ ప్రకారం పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇంకా ఆలయ అభివృద్ధికి అవసరమైన పనులు, నిధుల వివరాలతో నివేదిక సిద్ధం చేసి పంపిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మాడవీధుల పనులను కమిషనర్ పరిశీలించారు. అన్నదాన సత్రం, వేద పాఠశాల భవనాలు, ఆలయానికి సంబంధించిన ఇతర నిర్మాణ పనుల వివరాలు కమిషనర్ అడిగి తెలుసుకున్నారు. నాణ్యతలో ఎటువంటి రాజీలేకుండా పనులు చేపట్టాలని, మాస్టర్ ప్లాన్ ఆధారంగా పనులు పూర్తయ్యేలా ఆలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జోన్ డిప్యూటీ కమిషనర్ టి.శ్రీకాంత్‌రావు, సహాయ కమిషనర్ రాయల సునిత, మేడారం ఈవో రాజేంద్రం, ఇన్‌స్పెక్టర్లు సంజీవరెడ్డి, అనిల్, ఐఎన్‌పీఆర్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ జగన్, రీజినల్ ఇన్ఫర్మేషన్ ఇంజనీర్ శ్రీరాములు, డీపీఆర్‌వో కిరణ్మయి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాంకేతికతను జోడించి నాణ్యమైన విద్యుత్‌ను అందించాలి

ఎన్పీడీసీఎల్ ఉద్యోగులకు ట్రాన్స్‌కో సీఎండీ రోనాల్డ్ రోస్ పిలుపు


సమావేశంలో మాట్లాడుతున్న ట్రాన్స్ కో సీఎండీ రోనాల్డ్ రోస్

హనుమకొండ టౌన్, జూన్29: కొత్తగా వస్తున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ఎన్పీడీసీఎల్ ఉద్యోగులకు ట్రాన్స్‌కో సీఎండీ రోనాల్డ్‌రోస్ పిలుపునిచ్చారు. శనివారం నక్కలగుట్టలోని విద్యుత్ భవన్‌లో డైరెక్టర్లు, సీజీఎంలు, జీఎంలతో సీఎండీ రోనాల్డ్‌రోస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క ఉద్యోగి నైపుణ్యత, సామర్థ్యం పెంచుకోవాలని సూచించారు. వినియోగదారులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ వారధిలా నిలవాలన్నారు. నిబద్ధతతో పనిచేసి అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలన్నారు.

ఈ సందర్భంగా టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి డిస్కం గురించి రోనాల్డ్‌రోస్‌కు పూర్తిగా వివరించారు. కంపెనీ పరిధిలోని 16 సర్కిళ్ల పరిధిలో 67 లక్షల వినియోగదారులకు మెరుగైన సరఫరా అందిస్తున్నామని తెలిపారు. ఆపరేషనల్ స్ట్రక్చర్ గురించి ప్రస్తావిస్తూ ఇన్ ఫ్రాస్ట్రక్చర్, డిస్ట్రిబ్యూషన్, సంస్థ మానవ వనరులు, సబ్‌స్టేషన్స్ స్కాడా గురించి వివరించారు. సంస్థను బలోపేతం చేయడంలో భాగంగా కొత్త సబ్‌స్టేషన్‌ల నిర్మాణం, 33కేవీ ప్రత్యామ్నాయ సరఫరా, పాత సబ్‌స్టేషన్‌ల పునరుద్ధరణ పనులను చేపడుతున్నట్లు వెల్లడించారు. వినియోగదారులకు మరింత చేరువయ్యేలా ప్రతి సోమవారం సెక్షన్‌ల నుంచి సర్కిల్ కార్యాలయాల వరకు విద్యుత్ ప్రజావాణి నిర్వహిస్తున్నామన్నారు. విద్యుత్ బిల్లులపై క్యూఆర్ కోడ్ ముద్రించి అందిస్తున్నట్లు తెలిపారు. కొత్త టెక్నాలజీని అందిపుచ్చుకొని సబ్‌స్టేషన్ ఆటోమేషన్ చేపడుతున్నామన్నారు. అనంతరం సీఎండీ రోనాల్డ్ రోస్‌ను ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి మెమొంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు అశోక్‌కుమార్, సదర్‌లాల్, మోహన్‌రావు, తిరుపతిరెడ్డి, సిజీయంలు తిరుమల్‌రావు, మధుసూదన్, కిషన్, రాజుచౌహాన్, కె.ఎస్.గుప్తా, రవీంద్రనాథ్, ట్రాన్స్ కో సీఈ పుల్లయ్య, రాంకుమార్, తదితరులు పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కు భూ నిర్వాసితులకు ఇందిరమ్మ ఇళ్లు

అధికారులకు ఆదేశాలిచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి



టెక్స్‌టైల్ పార్కులో ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

గీసుగొండ, జూన్ 29 : కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు కోసం భూములిచ్చిన నిర్వాసితులకు వంద గజాల స్థలంలో అన్ని వసతులతో కూడిన ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గీసుగొండ మండలంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును శనివారం సీఎం రేవంత్‌రెడ్డి 50 నిమిషాల పాటు పరిశీలించారు. హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో వచ్చిన సీఎం టెక్స్‌టైల్ పార్కులోని యంగ్వాన్ కంపెనీ సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు మధ్యాహ్నం 01.10 గంటకు చేరుకున్న ఆయన అక్కడి నుంచి బస్సులో కిలోమీటరు దూరంలో ఉన్న కైటెక్స్ కంపెనీ వద్ద ఏర్పాటు చేసిన వనమహోత్సవ కార్యక్రమానికి 01.25 గంటలకు చేరుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం టెక్స్‌టైల్ పార్క్‌లో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. పార్కు స్థలం మ్యాప్‌తోపాటు ఏర్పాటవుతున్న కంపెనీల వివరాలు, ఉత్పత్తుల గురించి స్పెషల్ చీఫ్ సెక్రటరీ జయేష్‌రంజన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సీఎంకు వివరించారు. ఈ క్రమంలో గతేడాది భారీ వర్షాల వల్ల పార్కు స్థలంలో 300 ఎకరాలు ముంపునకు గురై కైటెక్స్ కంపెనీ నిర్మాణ పనులు నిలిచి పోయాయని, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని కంపెనీ ప్రతినిధి మనోజ్ కుమార్ సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన సీఎం వరద ముంపును నివారించేందుకు 10 ఎకరాల్లో పాండ్‌ను నిర్మించి అందులోని నీటిని పరిశ్రమలకు ఉపయోగించుకునే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలంలో పాండ్‌లో ఎక్కువైన నీటిని కాలువ ద్వారా సమీప చెరువులోకి పంపించేలా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని టీజీఐఐసీ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా భూ నిర్వాసితులకు నీటి సరఫరా, రోడ్లు, విద్యుత్, డ్రెయినేజీ వంటి మౌలిక వసతులతో వంద గజాల ప్లాట్లు ఇచ్చి ఇందిరమ్మ ఇళ్ల సబ్సిడీని కూడా అందించాలని కలెక్టర్‌కు సీఎం సూచించారు. అలా భూ నిర్వాసితులకు నిర్మించే కాలనీని మేజర్ గ్రామపంచాయతీగా గుర్తించి అన్ని వసతులను కల్పించాలన్నారు. భూ నిర్వాసితులకు ఇప్పటి వరకు 1200 ప్లాట్లు ఏర్పాటు చేశామని.. ఇంకా 150 మందికి ఇవ్వాల్సిన ప్లాట్లను పైలాన్ వద్ద సిద్ధం చేస్తున్నట్లు టీజీఐఐసీ అధికారులు సీఎంకు వివరించారు. అనంతరం 2గంటలకు ఎగ్జిబిషన్ హాల్ నుంచి బయటకు వచ్చిన సీఎంను కలిసేందుకు కాంగ్రెస్ నాయకులు పోటీపడ్డారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దామోదర రాజనర్సింహ, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, కేఆర్ నాగరాజు, ఎంపీ కడియం కావ్య, సీఎస్ శాంతికుమారి, డీజీపీ రవిగుప్తా, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, ఇంధన శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, ట్రాన్స్‌కో సీఎండీ రోనాల్డ్‌రాస్, ప్రిన్సిపల్ సెక్రటరీ హనుమంతు, సీఎంవో స్పెషల్ సెక్రటరీ అజిత్, ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి, వరంగల్ కలెక్టర్ సత్యశారదాదేవి, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ సంతోష్‌కుమార్, ఎంపీపీలు భీమగాని సౌజన్య, కళావతి, సంగెం జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



మొక్కనాటుతున్న రేవంత్

మెడికవర్ ఆస్పత్రిని ప్రారంభించిన సీఎం



సీఎంకు జ్ఞాపికను అందిస్తున్న మెడికవర్ ఆల్ ఇండియా చైర్మన్, డైరెక్టర్ అనిల్‌కృష్ణ

బాలసముద్రం, జూన్ 29: వరంగల్ నగరంలో అత్యాధునిక వసతులతో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు హంటర్‌రోడ్డులో ఏర్పాటు చేసిన మెడికవర్ సూపర్ మల్టీ స్పెషాలిటీ 300 పడకల ఆస్పత్రిని సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రారంభించారు. ప్రపంచవ్యాప్తంగా 12 దేశాలలో కార్యకలాపాలు నిర్వహిస్తూ అత్యంత హెల్త్ కేర్ బ్రాండ్‌గా గుర్తింపుపొందిన మెడికవర్ ఆస్పత్రి 24వ బ్రాంచ్‌ను వరంగల్‌లో ఏర్పాటు చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డి నిర్వాహకులను అభినందించారు. సువిశాలమైన భవనంలో అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేసిన ఆస్పత్రిలో వైద్య పరికరాలను సీఎం పరిశీలించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డిని, మంత్రులను మెడికవర్ ఆల్ ఇండియా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు శరత్‌రెడ్డి, హరికృష్ణలు శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ అనిల్‌కృష్ణ మాట్లాడుతూ.. దేశంలో అగ్రగామి మల్టీనేషనల్ ఆస్పత్రి చైన్‌గా 24 ఆస్పత్రులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 2015లో నలుగురితో ప్రారంభించిన మెడికవర్ ఆస్పత్రి.. లక్షల మందికి వైద్య సేవలందించిందన్నారు. కరోనా సమయంలో లక్షలాది మందికి ఉచితంగా వ్యాక్సినేషన్ అందించినట్లు తెలిపారు. రాష్ట్రప్రభుత్వం మెడికవర్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. హెల్త్ హబ్‌గా తీర్చి దిద్దేందుకు మెడికవర్ కలిసి పనిచేస్తుందని అన్నారు. వరంగల్‌లో 300 పడకలతో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో 7 ఆపరేషన్ థియేటర్స్‌తో పాటు ఎక్కువ సంఖ్యలో ఐసీయూ బెడ్స్, ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు నగర ప్రజలకు అందించనున్నట్లు తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ.. వరంగల్ నగరం విశ్వనగరంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మెడికవర్ హాస్పిటల్ వరంగల్ నగరంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ధనసరి అనసూయ (సీతక్క), కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గండ్ర సత్యనారాయణరావు, కేఆర్.నాగరాజు, నాయిని రాజేందర్‌రెడ్డి, కడియం శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ప్రారంభించిన సీఎం



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

హనుమకొండ కలెక్టరేట్, జూన్29: మహిళా సంఘాల సభ్యులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఇందిర మహిళా శక్తి క్యాంటీన్ల ఏర్పాటుకు ఇటీవ ల శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మెప్మా ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్‌లో మహిళా సంఘం ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇందిర మహిళా శక్తి క్యాంటీన్‌ను శనివారం సీఎం రేవంత్‌రెడ్డి రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళా సంఘం సభ్యులు సొంతంగా తయారుచేసిన పిండి వంటలను సీఎం రుచి చూసి అభినందించారు. మహిళా సం ఘాలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తామని వారికి హామీ ఇచ్చారు. సీఎం వెంట మంత్రులు కోమటిరెడ్డి రాజగో పాల్ రెడ్డి, దామోదర రాజనరసింహ, కొండా సురేఖ, సీతక్క, సీఎస్ శాంతికుమారి, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు ప్రావీణ్య, సత్యశారదాదేవి, ఎమ్మెల్యేలు ఉన్నారు.

కుట్టుమిషన్ స్టాల్‌ను సందర్శించిన సీఎం

డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో మహిళా శక్తి పథకం కింద మహి ళా సంఘాలకు కుట్టుమిషన్లు ఇచ్చారు. ఈ మహిళా సంఘా ల సభ్యులు శనివారం కలెక్టరేట్‌లో స్టాల్ ఏర్పాటు చేయగా సీఎం రేవంత్ రెడ్డి స్టాల్‌ను సందర్శించి మహిళలతో మాట్లా డారు. యూనిఫాంలు కుట్టడంలో ఏమైనా ఇబ్బందులు ఎదు రయ్యాయా? మీరు ఎంతమందికి యూనిఫామ్స్ కుట్టారు? ఎలా అనిపించింది? దీనివల్ల లాభం ఉందా? ఆర్థికంగా నిల దొక్కుకున్నారా? ఎవరెవరు ఎన్ని కుట్టారు? అని సభ్యులతో సీఎం మాట్లాడారు. హనుమకొండ, వరంగల్ జిల్లాల డీఆర్‌డీఓలు నాగ పద్మజ, కౌసల్యదేవి డీపీఎంలు జె.ప్రకాశ్, ఎం.అనిల్, ఎ.శ్రీకాంత్ కార్యక్రమంలో ఉన్నారు.



కుట్టుమిషన్ కేంద్రంలో మహిళలతో ముచ్చటిస్తూ..

సీఎం పర్యటన సాగిందిలా..

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 29: వరంగల్ మహానగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష చేయడానికి శనివారం సీఎం రేవంత్‌రెడ్డి వరంగల్, హనుమకొండ జిల్లాల్లో పర్యటించారు. సీఎం రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 1:16నిమిషాలకు వరంగల్ జిల్లా సంగెం మండలంలోని టెక్స్‌టైల్‌పార్కుకు చేరుకున్నారు. అక్కడ వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం అక్కడి నుంచి 2:02 నిమిషాల కు బయలుదేరి 2:37 నిమిషాలకు వరంగల్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ ఆస్పత్రిని పరిశీలించి 2:52 నిమిషాలకు అక్కడి నుంచి బయలుదేరి 3:04 నిమిషాలకు హనుమకొండలోని కలె క్టరేట్‌కు చేరుకున్నారు. అక్కడ కార్యక్రమాలు ముగించుకుని సాయంత్రం 6:18 నిమిషాలకు బయలుదేరి హంటర్‌రోడ్‌లోని మెడికవర్ ఆస్పత్రికి 6:24నిమిషాలకు చేరుకున్నారు. అనంతరం అక్కడ ఆస్పత్రిని ప్రారంభిం చారు. అక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడి సీఎం రేవంత్‌రెడ్డి తిరిగి అక్కడి నుండి 7:12 నిమిషాలకు వెళ్లిపోయారు.

అంచనా వ్యయం పెంపుపై సీఎం ఆగ్రహం

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పరిశీలించిన సీఎం

వరంగల్ మెడికల్, జూన్ 29: వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ అంచనా వ్యయం పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మధ్యాహ్నం వరంగల్‌లో నిర్మిస్తున్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులను పరిశీలించిన ఆయన అధికారులతో మాట్లాడుతూ.. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం విషయంలో రూ.1100కోట్లున్న అంచనా వ్యయాన్ని ఎలాంటి అనుమతులు లేకుండా రూ.1,726 కోట్లకు ఇష్టారాజ్యంగా ఎలా పెంచారని, కేవలం మౌఖిక ఆదేశాలతో రూ.626కోట్ల వ్యయం ఎలా పెంచుతారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రి నిర్మాణ వ్యయంపై పూర్తిస్థాయి ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా యుద్ధప్రాతిపదికన హాస్పిటల్ నిర్మాణం పూర్తి చేయాల్సిందే నని నిర్మాణం సంస్థకు సీఎం తేల్చిచెప్పారు. ఆస్పత్రి అంతస్తుల వివరాలను రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తూ సీఎంకు వివరించారు. ఒకటి నుంచి 15 అంతస్తులు చికిత్స కోసమని, ఇందులో మూడు, నాలుగు ఫ్లోర్లు థియేటర్లు ఉంటాయని వివరించారు. అదే విధంగా 12, 13 ఫ్లోర్లలో లేబరోటరీలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. 16, 17, 18 ఫ్లోర్లలో అకడమిక్ కార్యక్రమాలు కొనసాగుతాయని, 20, 21 ఫ్లోర్లలో సీనియర్ రెసిడెంట్లు ఉంటారని, 23వ ఫ్లోర్‌లో పరిపాలన భవనం ఉంటుందని సీఎం రేవంత్‌రెడ్డికి వివరించారు. నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనలకు లోబడి నిర్మాణం జరుగుతుందని, కాకతీయ వైద్య కళాశాల సూపర్ స్పెషాలిటీలో ప్రస్తుతం తొమ్మిది విభాగాల్లో ఐదు విభాగాలు కొత్త బ్లాక్‌లోకి వస్తాయని సీఎంకు తెలిపారు. సీఎం అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ నూతన ఆస్పత్రిలో సర్జికల్ గ్యాస్ట్రో, మెడికల్ జెనెటిక్స్, జీడియాట్రిక్స్, రుమటాలజీ, సర్జికల్ ఆంకాలజీ లాంటి ఎనిమిది కొత్త విభాగాలను కూడా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఎంజీఎం ఆస్పత్రిలో పీడియాట్రిక్ విభాగంతో పాటు మాతాశిశు సంరక్షణ విభాగం కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ, రెవెన్యూ శాఖ మంత్రి పి.శ్రీనివాస్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ప్లాన్‌ను పరిశీలిస్తున్న రేవంత్‌రెడ్డి

నగర సమగ్రాభివృద్ధికి.. మాస్టర్ ప్లాన్..



సమీక్షకు హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు

(5వ పేజీ తరువాయి)

సూచించారు. నాలాలపై అక్రమ నిర్మాణాలు ఉంటే వెంటనే తొలగించాలని ఆదేశించారు. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణంపై డిటేల్డ్ ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. వర్షం కురిసినప్పుడు ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణ పనుల అంచనాల వ్యయం ఎందుకు పెరిగిందని అధికారులను ప్రశ్నించారు. ఈపీసీ పద్ధతిన పనులు చేపడుతున్నందు వల్ల ఇలా పెంచే వీలు లేదని, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల విలువ పెంపు అంచనాల పెంపుపై ప్రత్యేక నివేదిక తయారు చేయాలని ఆదేశించారు.

సమగ్ర వివరాలతో మాస్టర్‌ప్లాన్ రూపొందించాలి

2050 సంవత్సరం వరకు వరంగల్ అభివృద్ధికి సరిపడేలా సమగ్రమైన వివరాలతో మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సీఎం రేవంత్ అధికారులకు సూచించారు. వరంగల్‌లో హైదరాబాద్‌లో ఉన్న నిలోఫర్ ఆస్పత్రి తరహాలో అన్ని హంగులతో ఓ ఆస్పత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మామునూరు ఏయిర్ పోర్టు నిర్మాణానికి అవసరమైన భూ సేకరణ వెంటనే చేపట్టాలని, ఇందుకు అవసరమైన నిధులు కేంద్ర ప్రభుత్వం సమకూరుస్తుందో లేదో తెలుసుకోవాలన్నారు. అలాగే సెప్టెంబర్ 9 నాటికి కాళోజీ కళాక్షేత్రం నిర్మాణం పనులు పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని, ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని అధికారులను హెచ్చరించారు. అత్యవసర సమయాల్లో ఆపరేషన్లు, ఇతర వైద్య సేవలకు నిమ్స్‌లో అందిస్తున్నట్లుగా ఎంజీఎం ఆస్పత్రిలో ఎన్‌వోసీ ఇచ్చే అంశంపై పరిశీలన జరుపుతామన్నారు. ఎమర్జెన్సీ సమయంలో సర్జరీలు, వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు, సిబ్బందికి తగిన పారితోషికం అందిస్తామని, స్వశక్తి మహిళా సంఘాలను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని రేవంత్ పేర్కొన్నారు. స్కూల్ విద్యార్థుల యూనిఫారంకు సంబంధించిన పెండింగ్ బిల్స్ ఉంటే వెంటనే చెల్లించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. రాబోయే రోజుల్లో అన్ని ప్రభుత్వ శాఖల యూనిఫామ్‌లు కుట్టించే బాధ్యతను మహిళా సంఘాలకు అప్పగించే అవకాశం ఉందని, ఈ విషయాన్ని చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలో వరంగల్ అభివృద్ధిపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు రేవంత్ రెడ్డి తెలిపారు. ఇందుకోసం అన్ని వివరాలతో కూడిన ఒక ప్రణాళికను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. వరంగల్ నగర అభివృద్ధికి రూ.6,115 కోట్ల నిధులు అవసరమని ప్రాథమికంగా గుర్తించామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయబోమని, సుపరిపాలన అందించితీరుతామని ముఖ్యమంత్రి అన్నారు. వరంగల్ నగరాభివృద్ధికి అడిగినన్ని నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వారసత్వ పరంగా వరంగల్ నగరానికి గొప్పపేరుందని గుర్తు చేశారు. సమర్థత ఆధారంగానే బదిలీలు నిర్వహిస్తామన్నారు. రాజకీయ ప్రేరేపిత బదిలీలు ఉండబోవని స్పష్టం చేశారు. అధికారులు భయపడాల్సి అవసరం లేదని, ఎవరి పనివారు చేసుకుంటూ ముందుకు సాగాలని హితవు పలికారు. ప్రస్తుతం తాను సమీక్షను ప్రాథమికంగానే నిర్వహించానని, 45 రోజుల తర్వాత వచ్చి పూర్తి స్థాయిలో మరో సారి సమీక్ష సమావేశం నిర్వహిస్తానని చెప్పారు.

రింగ్‌రోడ్డు భూసేకరణ వేగవంతానికి చర్యలు : పొంగులేటి

రింగ్ రోడ్డు భూసేకరణ వేగవంతానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి అంచనా వ్యయం పెరగడంపై లోతుగా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ ఆస్పత్రి ద్వారా వెంటనే వైద్యసేవల అందుబాటులో వచ్చేలా చూస్తామన్నారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మట్లాడుతూ.. కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) రూపొందించిన మాస్టర్ ప్లాన్ సరిగా లేదని, మళ్లీ కొత్త మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాల్సిన అవసరం ఉందని అన్నారు. వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. నగరంలోని కొన్ని చోట్ల ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురయ్యాయని, సీఎం దృష్టికి తీసుకువచ్చారు. వీటిని తిరిగి స్వాధీనం చేసుకోవాలని కోరారు. నగరంలో పేరుకుపోయిన సమస్యలను సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. వరంగల్ సమగ్రాభివృద్ధిని నిరంతరం పర్యవేక్షించడానికి ఒక స్పెషల్ ఆఫీసర్‌ను నియమించాలని సూచించారు. ఈ సమీక్షా సమావేశంలో పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకువచ్చారు. రింగ్ రోడ్డు నిర్మాణంతో పాటు జాతీయ రహదారుల అనుసంధానం సాధ్యాసాధ్యాల గురించి వివరించారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి మాట్లాడుతూ వరంగల్ నగర అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనలు పాటిస్తామన్నారు. సమీక్ష సమావేశంలో చర్చకు వచ్చిన ప్రతీ అంశాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తామన్నారు. వరంగల్ నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణానికి సత్వరమే చర్యలు తీసుకుంటామని, మామునూరు ఏయిర్ పోర్టు నిర్మాణానికి భూసేకరణ పనులను త్వరలో చేపడతామని చెప్పారు. అనంతరం స్వశక్తి మహిళలకు రూ. 518.71 కోట్ల చెక్కును ముఖ్యమంత్రి అందజేశారు. ఈ సమీక్షా సమావేశంలో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క), వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రామచంద్రునాయక్, సీఎం సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి, నగర మేయర్ గుండు సుధారాణి, ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, బండా ప్రకాశ్, ఉమ్మడిజిల్లా ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కెఆర్ నాగరాజు, గండ్ర సత్యనారాయణ, యశస్వినిరెడ్డి , తెలంగాణ స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మెన్ సిరిసిల్ల రాజయ్యతో పాటు వరంగల్, హనుమకొండ కలెక్టర్లు సత్యశారదాదేవి, ప్రావీణ్య, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గంజాయి పట్టివేత

ఏటూరునాగారం, జూన్ 29 : ములుగు జిల్లా ఏటూరునాగారం మీదుగా ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న గంజాయిని పోలీసులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. ఏటూరునాగారం ఏఎస్పీ గీతే మహేష్ బాబాసాహెబ్ మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని అటవీ శాఖ చెక్ పోస్టు వద్ద ఎస్సై తాజుద్దీన్ నేతృత్వంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. అదే క్రమంలోనే అటుగా వచ్చిన వ్యక్తి పోలీసులను చూసి పారిపోతుం డగా అతడిని పట్టుకొని విచారించారు. అతడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లా ఏటపాక మండలంలోని గుండాల కాలనీ గ్రామానికి చెందిన పిల్లం వీర్రాజు(29) అని, వృత్తిరీత్యా పెయింటర్ అని, ఏటూరునాగారం మీదుగా ఇతర ప్రాంతాలకు గంజాయిని రవాణా చేస్తుంటాడని తేలింది.

అతడి వద్ద నుంచి రూ. 4 లక్షల విలువ చేసే 16 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించామని ఏఎస్పీ తెలిపారు. మీడియా సమావేశంలోఏటూరునాగారం సీఐ శ్రీనివాస్, ఎస్సై తాజుద్దీన్, హెడ్‌కానిస్టేబుల్ రామారావు పాల్గొన్నారు.


మీడియాతో మాట్లాడుతున్న ఏఎస్పీ గీతే మహేష్

అంకితభావంతో పనిచేస్తే ఆదరణ

ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు


మనోహర్‌రావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

చిట్యాల, జూన్ 29: అంకితభావంతో విధులు నిర్వర్తించే ఉద్యోగులకు ఆదరణ మెండుగా లభిస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, పీఆర్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి అన్నారు. మండలంలోని జడల్‌పేట శివారు భీష్మనగర్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాసిని మనోహర్‌రావు ఉద్యోగ విరమణ పొందగా ఆయన వీడ్కోలు సభ శనివారం జరిగింది. ఈసందర్భంగా మనోహర్‌రావు దంపతులను ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంతోమంది చిన్నారులకు ఆప్యాయతను పంచి విద్యాబుద్ధులు నేర్పిన మనోహర్‌రావు ఉత్తమ సేవలు అందించారని కొనియాడారు. ఈకార్యక్రమంలో టేకుమట్ల జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సుభాకర్‌రెడ్డి, కిరణ్‌కుమార్, నైన్‌పాక కాంప్లెక్స్ హెచ్ఎం ఊర్మిళ, పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ

మొగుళ్లపల్లి: మండలంలోని బంగ్లపల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన గోనెల వర్ష కుటుంబ సభ్యులను భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పరామర్శించారు. వర్ష చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఎర్రబెల్లి పున్నంచందర్, ఎమ్డీ.రఫీ, కుమారస్వామి, తదితరులు ఉన్నారు.

రుణమాఫీపై అభిప్రాయ సేకరణ

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 29: రైతు రుణమాఫీపై రాష్ట్ర ప్రభుత్వం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలని ఆదేశాలు జారీ చేసిందని వ్యవసాయశాఖ జిల్లా అధికారి విజయభాస్కర్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. మూడు రోజులపాటు జిల్లాలోని పీఏసీఎస్‌లలో సమావేశాలు ఉంటాయని పేర్కొన్నారు. జూలై 1న గణపురం, చెల్పూరు పీఏసీఎస్‌లలో, 2న మహదేవపూర్, గారెపల్లి, మొగుళ్లపల్లి, మహముత్తారం పీఏసీఎస్‌లలో, 3న చిట్యాల, తాడిచర్ల పీఏసీఎస్‌లలో సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు, ప్రజాప్రతినిధులను ఆహ్వానించి అభిప్రాయాలను తెలుసుకుంటామని పేర్కొన్నారు. ఎవరైనా తమ అభిప్రాయాలను తెలపొచ్చని పేర్కొన్నారు.

● రేగొండ: రైతు భరోసా పథకంపై మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం మధ్యాహ్నం నిర్వహించే ప్రజాభిప్రాయ సభను విజయవంతం చేయాలని పీఏసీఎస్ చైర్మన్ నడిపల్లి విజ్జన్‌రావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు హాజరవుతారని తెలిపారు. కొత్తపల్లిగోరి, రేగొండ మండలాలకు చెందిన రైతులు, పీఏసీఎస్ డైరెక్టర్లు, అధికారులు హాజరుకావాలని కోరారు.

● వెంకటాపురం(నూగూరు): మండల కేంద్రంలోని సొసైటీహాల్‌లో శనివారం రైతుభరోసా పథకంపై రైతుల నుంచి అభిప్రాయ సేకరణ కార్యక్రమం జరిగింది. పీఏసీఎస్ అధ్యక్షుడు చిడెం మోహన్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుమారు 150 మంది రైతులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఐదు నుంచి పదెకరాలలోపు రైతులకు రైతుభరోసా వర్తింపజేయాలని, రైతుబంధు రెట్టింపు చేయాలని, కౌలురైతులకు రైతుభరోసా పథకం వర్తింపజేయాలని పలువురు రైతులు అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్‌చంద్ర, డీసీవో కార్యాలయ అధికారి చంద్రశేఖర్, ఏఈవో శ్యాంసుందర్, సొసైటీ కార్యదర్శి సత్యనారాయణ, సిబ్బంది పూర్ణ, సుధారాణి, రైతులు పాల్గొన్నారు.

● మహాముత్తారం: మండల కేంద్రంలోని సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో జూలై 2న మధ్యాహ్నం రైతు భరోసా పథకంపై అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు సీఈవో శ్రీధర్ తెలిపారు. జిల్లా అధికారులు, ప్యాక్స్ చైర్మన్, డైరెక్టర్లు పాల్గొంటారని పేర్కొన్నారు.

● వాజేడు: రైతు భరోసా పథకంపై అభిప్రాయ సేకరణ కార్యక్రమం శనివారం మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద జరిగింది. డీసీవో సర్దార్ సింగ్, పీఏసీఎస్ చైర్మన్ ఎగ్గడి అంజయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఎకరాల పరిమితి లేకుండా ఈ పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. మరికొంత మంది రైతులు ఐదెకరాల లోపు వారికి అమలు చేసి ఎరువులను తక్కువ ధరలకు ఇవ్వాలని అన్నారు. మరికొంత మంది రైతులు పది ఎకరాలలోపు వారికి వర్తింపజేయాలని కోరారు. కౌలు రైతులకు సైతం రైతు భరోసా పథకాన్ని అమలు చేయాలని అభిప్రాయం కూడా వ్యక్తమైంది. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ వత్సవాయి జగన్నాథరాజు, సీఈవో సోమా సత్యనారాయణ, ఏఈవోలు రాధిక, జాఫర్, సిబ్బంది వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మూతబడిన పాఠశాలలను తెరిపించండి

ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక


వినతి పత్రాన్ని అందిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

భూపాలపల్లిటౌన్, జూన్ 29: మూతబడిన పాఠశాలలను వెంటనే తెరిపించాలని ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. హడావుడిగా సెక్టోరియల్ అధికారుల నియామకం చేపట్టడం సరికాదని ఆక్షేపించింది. ఈ మేరకు డీఈవో కార్యాలయంలో టీఆర్‌టీఎఫ్, డీటీఎఫ్, టీపీటీఎఫ్, ఎస్‌జీటీయూ, టీపీఆర్‌టీయూ, టీఆర్‌టీఎఫ్ సంఘాల జిల్లా అధ్యక్షులు మధుసూదన్, రమణారెడ్డి, సేవానాయక్, కృష్ణప్రసాద్, శ్రీనివాస్, తిరుపతి, ఎన్.తిరుపతి, రఘుకుమార్, శంకర్ శనివారం వినతిపత్రం అందజేశారు. నిరుపేద వర్గాలకు విద్యను అందించే పాఠశాలలు మూతబడటం సరి కాదన్నారు. వాటిలో విద్యార్థులను చేర్పించి వెంటనే తెరిపించాలని డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా సెక్టోరియల్ అధికారులను నియమించడం సరికాదని, వెంటనే వాటిని రద్దు చేసి మళ్లీ ఎంపిక చేప ట్టాలని అన్నారు. సీఎంవో, జీసీడీవో నియామకాలపై పునఃపరిశీలించాలని అన్నారు.

675 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం

ఉద్యాన, పట్టు పరిశ్రమల శాఖ జిల్లా అధికారి సంజీవరావు

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 29: జయశంకర్ భూపాలపల్లి జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది 675 హెక్టార్ల సూక్ష్మ సేద్యం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించిందని జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల శాఖ అధికారి డి. సంజీవరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మామిడి ఐదు హెక్టార్లు, జామ ఐదు, బొప్పాయి 15, టిష్యూ కల్చర్ అరటి 30, డ్రాగన్ ఫ్రూట్ రెండు హెక్టార్లు, మల్చింగ్ పథకంలో 175 హెక్టార్ల లక్ష్యాన్ని నిర్దేశించిందని వివరించారు. వీటితో పాటు సూక్ష్మ సేద్యం పథకంలో భాగంగా జామ, డ్రాగ్ ఫ్రూట్ సాగుకు 55 హెక్టార్లు, తుంపర సేద్యం కోసం 64 హెక్టార్లు, ఆయిల్‌పాం సాగుకు 124 హెక్టార్లు, డ్రిప్ పరికరాల కోసం లక్ష్యం నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలి

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రవీణ్

కాకతీయఖని, జూన్ 29: ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సొత్కు ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. 2024-25 విద్యా సంవత్సరానికి ఒక్కో తరగతికి రూ.4వేల ఫీజులు పెంచారని తెలిపారు. పేరెంట్స్ కమిటీ తీర్మానం లేకుండా, విద్యాశాఖ అధికారులకు తెలియకుండా విచ్చల విడిగా ఫీజులు పెంచడం దారుణమని విమర్శించారు.అలాగే విద్యా సంస్థల యాజమాన్యాలు పాఠశాలల్లోనే పుస్తకాలను అమ్ముతున్నారని, రూ. వెయ్యికి లభించే బుక్స్‌ను రూ. 8వేలకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఈ చర్యలపై కలెక్టర్, విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సింగరేణికి సేవలు అందించడాన్ని అదృష్టంగా భావించాలి : జీఎం హబీబ్

కాకతీయఖని, జూన్ 29: సింగరేణి సంస్థకు సేవలు అందించడాన్ని అదృష్టంగా భావించాలని భూపాలపల్లి ఏరియా జీఎం హబీబ్ హుస్సేన్ అన్నారు. సింగరేణి పర్చేజ్ డిపార్ట్‌మెంట్ ఆఫీస్ అటెండెంట్‌గా పనిచేసిన నర్సయ్య రిటైర్ అయ్యారు. ఆయనకు సన్మాన కార్యక్రమం శనివారం జరగ్గా ముఖ్య అతిథిగా హాజరైన జీఎం మాట్లాడారు. అధికారులు జ్యోతి, తుకారాం, రాజారావు, విశ్వనాథ్ మల్లికార్జున్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్యను బోధించాలి

కాటారం, జూన్ 29: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్య బోధించాలని మహదేవ్‌పూర్ సీడీపీవో రాధిక అన్నారు. మండలంలోని దేవరాంపల్లి జడ్పీహెచ్ఎస్ భవనంలో మూడు రోజులుగా పలు సెక్టార్లకు చెందిన అంగన్‌వాడీ టీచర్లకు పూర్వ ప్రాథమిక విద్య రివైజ్డ్ సిలబస్‌పై నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమం శనివారంతో ముగిసింది. మాస్టర్ ట్రైనర్స్ అయిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు సరస్వతి, భాగ్యలక్ష్మి, వీణ ఏడబ్ల్యూటీలకు పలు అంశాలపై శిక్షణనిచ్చారు. పిల్లలకు సులభతరంగా ఆటపాటలు, కథలు, బొమ్మలు, చార్ట్స్ ద్వారా సృజనాత్మకతతో బోధించేలా శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలు సెక్టార్లకు చెందిన 40మంది అంగన్‌వాడీ టీచర్లు శిక్షణ పొందారు.

● మొగుళ్లపల్లి : మూడు నుంచి ఐదేళ్లలోపు పిల్లలకు ఆటపాటలతో నాణ్యమైన విద్యను అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. మొగుళ్లపల్లి, రంగాపురం గ్రామాల్లో అంగన్‌వాడీ టీచర్లకు మూడురోజులుగా జరుగుతున్న శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. మండలంలోని మూడు సెక్టారుల్లో 60మంది అంగన్‌వాడీ టీచర్లు, టేకుమట్ల మండలంలోని ఒక సెక్టార్‌లోని 16మంది ద్వారా నూతన జాతీయ విద్యావిధానంలో భాగంగా చిన్నారులకు బోధించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సునీత, అరుణ, కవిత, సంధ్యారాణి, జయప్రద, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

● మహదేవపూర్ : మండల కేంద్రంలోని ఐసీడీఎస్‌లో ఆరో బ్యాచ్‌కు నూతన జాతీయ విద్యా విధానంలో చేపట్టిన ప్రీప్రైమరీ శిక్షణ పూర్తయింది. చిన్నారులకు ఆటపాటలతో పూర్వ ప్రాథమిక శిక్షణ ఇవ్వనున్నట్లు సీడీపీవో రాధిక తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు మమత, అరుణ, శివరాణి, నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు నిధులు

కాటారం, జూన్ 29: మండలంలోని పలు గ్రామపంచాయతీల్లో తాగునీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా 53 స్కీంపాయింట్ బోర్లు వేయడానికి నిధులు మంజూరయ్యాయి. నీటి సమస్యలపై ప్రజా ప్రతినిధులు, ప్రజలు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకువిన్నవించుకోవడంతో కలెక్టర్‌తో ఆయన మాట్లాడారు. మండలానికి రూ.1.36కోట్లు డీఎంఎఫ్‌టీ నిధులు మంజూరు చేయించారు. 53బోర్లు వేసి మోటార్లు బిగించి పైప్‌లైన్ల ద్వారా నీటి సరఫరా చేయడానికి నిధులు మంజూరయ్యాయి. మండల కేంద్రమైన కాటారం గ్రామపంచాయతీలో వివిధ ప్రాంతాలకు అత్యధికంగా 17బోర్లు, రేగులగూడెం జీపీకి ఐదు, గంగారం జీపీలో నాలుగుతో పాటు పలు గ్రామ పంచాయతీల్లోని వివిధ గ్రామాలకు బోర్లు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు.

అభివృద్ధిపై దృష్టిసారించాలి : సీతారాం నాయక్

ములుగు, జూన్ 29: ములుగు నియోజకవర్గ అభివృద్ధిపై రాష్ట్రప్రభుత్వం దృష్టి సారించాలని, ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీలను మంత్రి సీతక్క నిలబెట్టుకోవాలని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ డిమాండ్ చేశారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు వెన్నకంటి శ్రీరాములుతో కలిసి శనివారం ములుగులోని బీజేపీ జిల్లా కార్యాలయానికి వచ్చిన ఆయన ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పించారు. గోదావరి కరకట్ట నిర్మాణంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. రామప్ప అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయని విమర్శించారు. విద్యాశాఖకు మంత్రిని నియమించని ఘనత కాంగ్రెస్ పార్టీదేనని, గిరిజనుల అభివృద్ధి కోసం మంత్రిత్వ శాఖను ఏర్పాటుచేయాలని సీతారాంనాయక్ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, ఎస్టీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, ఉపాధ్యక్షుడు భూక్యా జవహర్, నాయకులు జినుకల కృష్ణాకర్‌రావు, రవీంద్రాచారి, గంగిశెట్టి రాజ్‌కుమార్, గాదం కుమార్, ఏరువ పాపిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని ఎస్ఎఫ్ఐ ధర్నా

భూపాలపల్లిటౌన్, జూన్ 29: నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట శనివారం బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి కుమ్మరి రాజ్‌కుమార్ మాట్లాడుతూ పేపర్ లీకేజీలతో పేదలకు ఉన్నత విద్యావకాశాలు లేకుండా కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. దేశంలో కామన్ విద్యా విధానం లేకుండా ఒకే దేశం, ఒకే పరీక్ష సాధ్యపడదన్నారు. కేంద్రీకృత పరీక్షల విధానాన్ని రద్దు చేయాలని, నీట్, సీయూఈటీ, నెట్, గేట్ వంటి దేశవ్యాప్త స్వభావం కలిగిన పరీక్షలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివ, చందు, ప్రవీణ్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జ్ డీఈవోగా రాజేందర్



భూపాలపల్లిటౌన్, జూన్ 29: జయశంకర్ భూపాలపల్లి ఇన్‌చార్జి డీఈవోగా ఎం.రాజేందర్‌కు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు విద్యాశాఖ కమిషనర్ లింగయ్య శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. భూపాలపల్లి డీఈవో రామ్‌కుమార్ శనివారం ఉద్యోగ విరమణ పొందారు. దీంతో భూపాలపల్లి జిల్లాలోనే అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రాజేందర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు.

పత్తిపల్లిలో జాతీయ గణాంకాల దినోత్సవం

ములుగు కలెక్టరేట్, జూన్ 29: ములుగు మండలంలోని పత్తిపల్లి జడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులు ప్రొఫెసర్ ప్రశాంత చంద్ర మహాలనోబిస్ జన్మదినాన్ని పురస్కరించుకుని శనివారం గణిత ఉపాధ్యాయుడు సుతారి మురళీధర్ ఆధ్వర్యంలో జాతీయ గణాంకాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఎ.రాజు గణాంకశాస్త్రానికి మహాలనోబిస్ అందించిన సేవలు, స్టాటిస్టికల్ ఇనిస్టిట్యూట్ స్థాపన, గణాంకాల సామర్థ్యాలను బలోపేతం చేసేందుకు డేటా అక్షరాస్యతను ప్రోత్సహించడానికి తెలియపరిచే పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.శ్రీనివాస్, ఎస్.రజిత, కె.శివరాం, నరసింహచారి, పి.రవి, స్వామి, శ్రీనివాస్, రజనీకాంత్, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులకు ఆశ్రయం కల్పించొద్దు

గోవిందరావుపేట, జూన్ 29: అటవీ ప్రాంతంలోని గ్రామాలు, గూడాలకు వచ్చే అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించొద్దని పస్రా ఎస్సై కమాలకర్ అన్నారు. శనివారం ఆయన పోలీస్ సిబ్బందితో కలిసి మండలంలోని దేవునిగుట్ట గొత్తికోయగూడాన్ని సందర్శించారు. ఈసందర్భంగా గొత్తికోయలను సమావేశపరిచి మాట్లాడారు. గొత్తికోయలు ప్రశాంత వాతావరణంలో జీవనం గడపాలని, కొత్తవ్యక్తులు వస్తే సమాచారం అందించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాకాలంలో వరదలు సంభవిస్తే తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం గొత్తికోయల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మల్లూరు ఆలయ భూములకు కౌలు వేలం

మంగపేట జూన్ 29 : మండలంలోని మల్లూరు శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం భూములకు కౌలు వేలాన్ని శనివారం నిర్వహించినట్లు ఈవో మహేష్ తెలిపారు. ఏటూరునాగారం మండలం శంకరరాజుపల్లిలోని ఒక ఎకరం 28 గుంటల భూమికి రూ. 18,600, తాడ్వాయి మండలంలోని కాటాపురంలోని 26.05 గుంటలకు రూ. 26 వేలు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ కౌలును 2024 జూలై 1 నుంచి మే 2025 వరకు ఇవ్వనున్నట్లు ఈవో మహేష్ తెలిపారు.


అధిక లోడ్‌తో వెళ్తున్న ఇసుక లారీ స్వాధీనం

వాజేడు, జూన్ 29: అధిక ఇసుక లోడుతో వెళ్తున్న ఇసుక లారీని పోలీసుల స్వాధీనం చేసుకున్నారు. వాజేడు ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం... గుమ్మడిదొడ్డిలో వాహనాల తనిఖీ చేస్తున్న క్రమంలో అతి వేగంగా వస్తున్న ఇసుక లారీని పోలీసులు ఆపి తనిఖీ చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉండాల్సిన ఇసుక కంటే అధికంగా ఉండటంతో స్టేషన్‌కు తరలించి లారీ డ్రైవర్ శ్యామకూర మధుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

రామప్పను సందర్శించిన శ్రీలంక జర్నలిస్టులు

వెంకటాపూర్(రామప్ప), జూన్ 29: రామప్ప దేవాలయాన్ని హైదరాబాద్‌లోని మానవ వనరుల అభివృద్ధి సంస్థలో శిక్షణ పొందుతున్న శ్రీలంక దేశానికి చెందిన జర్నలిస్టులు శనివారం సందర్శించారు. ఈసందర్భంగా వారు రామలింగేశ్వరస్వామిని దర్శించుకోగా పూజారులు హరీశ్ శర్మ, ఉమాశంకర్ పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ శిల్పకళా సంపదను వీక్షించి గైడ్‌ల ద్వారా ఆలయ చరిత్ర, విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను ఆస్వాదించారు. వారి వెంట ఎంసీహెచ్‌ఆర్‌డీ అధికారులు సురేష్, రవి, తదితరులు ఉన్నారు.

చెరువులో పడి ఒకరి మృతి


రామన్న (ఫైల్)

మహదేవపూర్, జూన్ 29: మండల కేంద్రంలోని కొత్త చెరువులో పడి మతి స్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడు. మహదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... మండల కేంద్రానికి చెందిన పెంట రామన్న శుక్రవారం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. గ్రామానికి చెందిన జాడి రాజేందర్ కొత్తచెరువు సమీపంలో రామన్న చెప్పులు గమనించి కుటుంబ సభ్యులకు తెలియజేశాడు. చెరువులో గాలించగా మృతదేహం శనివారం లభించింది. మృతుడి కుమారుడు స్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సైన్స్‌పై విద్యార్థులకు పద్యరచన పోటీలు

భూపాలపల్లిటౌన్, జూన్ 29: సైన్స్ పట్ల అవగాహన పెంచేందుకు ఎనిమిది, తొమ్మిదో తరగతి విద్యార్థులకు పలు అంశాలపై పద్య రచన, పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించినట్లు జిల్లా సైన్స్ అధికారి బర్ల స్వామి తెలిపారు. పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, అడవులను కాపాడాలని, విరివిగా మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిట్ పాఠశాల ప్రిన్సిపాల్ అనిత రాజేష్‌కుమార్, ఫిజికల్ ఫోరం అధ్యక్షుడు రాజబాబు, బయో ఫోరం అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

బొగత వద్ద పర్యాటకుల సందడి


బొగత జలపాతం వద్ద పర్యాటకులు

వాజేడు, జూన్ 29: బొగత జలపాతం వద్ద పర్యాటకుల సందడి నెలకొంది. ఇటీవల కురిసిన వర్షాలకు జలపాతంలోని నీరు ప్రవహిస్తోంది. వారాంత సెలవు కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు శనివారం తరలివచ్చారు. అత్యధికంగా వరంగల్, ములుగు, హైదరాబాద్, భద్రాచలం, ఏటూరునాగారం, భూపాలపల్లి తదితర ప్రాంతాల నుంచి వచ్చారు. జలపాతం అందాలను వీక్షించి మైమరచిపోయారు. ఈత కొలనులో ఉత్సాహంగా జలకలాడారు.

న్యూలుక్‌లో ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది

బొగత జలపాతం వద్ద ఉన్న ప్రొటెక్షన్ ఫోర్స్ సిబ్బంది న్యూలుక్‌లో కనిపిస్తున్నారు. ఇన్నాళ్లు సాధారణ వస్త్రధారణలో ఉండే వారు. దీంతో పర్యాటకులు వారిని గుర్తించేవారు కాదు. ఈ క్రమంలో అడవుల్లో ధరించే కామోఫ్లైజ్ డ్రెస్సును బొగత ప్రొటెక్షన్ ఫోర్సు సిబ్బందికి అటవీ శాఖ అందజేసింది. దీంతో వారు యూనిఫాంలో విధులు నిర్వర్తిస్తున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలి

● ములుగు ఎస్పీ శబరీశ్

ములుగు కలెక్టరేట్, జూన్ 29: సైబర్ నేరాల పట్ల జిల్లాలోని ప్రజలు అవగాహన కలిగి ఉండి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ డాక్టర్ శబరీశ్ అన్నారు. శనివారం ములుగులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో ఆధ్వర్యంలో రూపొందించిన సైబర్ హైజీన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన కూడళ్లు, బస్టాండ్లు, ప్రభుత్వ కార్యాలయాలు, ఇతర ప్రదేశాల్లో పోస్టర్లను అంటించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా ఉండేందుకు సెల్‌ఫోన్, కంప్యూటర్‌లో దృఢమైన, పొడవైన పాస్వర్డ్‌లను ఉపయోగిస్తూ తరచూ మార్చుతూ ఉండాలని, సోషల్ మీడియా ఖాతాలలో డేటా గోప్యత సెట్టింగ్స్‌ను ఉపయోగించి వాటిని ప్రైవేట్‌గా ఉంచాలని, ఉపయోగంలో లేనప్పుడు లాక్ చేయాలని, ఆన్‌లైన్ ఖాతాల కోసం రెండుదశల ప్రామాణీకరణను ఉపయోగించాలని అన్నారు. అదేవిధంగా అపరిచితులు పంపిన లింక్స్‌ను క్లిక్ చేయకూడదని, సీవీవీతోసహా వ్యక్తిగత సమాచారం, ఓటీపీ, క్రెడిట్, డెబిట్‌కార్డు సమాచారం చెప్పకూడదని, ఓపెన్, పబ్లిక్ వైఫై నెట్‌వర్క్‌లను ఉపయోగించవద్దని, పార్ట్‌టైం జాబ్‌లు, వర్క్‌ఫ్రం హోం అని వచ్చే కాల్స్, సందేశాలను నమ్మవద్దని, అనుకోనివిధంగా మోసపోతే సైబర్‌క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930కి డయల్ చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో సైబర్ సెక్యూరిటీ బ్యూరో డీఎస్పీ సందీప్‌రెడ్డి, ములుగు డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్, ఎస్సై వెంకటేశ్వర్‌రావు, ఎస్సై యాసిన్, సైబర్ సెక్యూరిటీ బ్యూరో సిబ్బంది జాహర్, ఉమామహేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాంలు సిద్ధం చేయాలి : కలెక్టర్ దివాకర


దుస్తుల కుట్టును పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

ములుగు రూరల్ జూన్ 29: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు అందించే యూనిఫాం దుస్తులను జూలై 5లోగా సిద్ధం చేయాలని కలెక్టర్ దివాకర అన్నారు. ములుగు మండలం పాల్సాబ్‌పల్లిలో మహిళా సంఘాల ఆధ్వరంలో నిర్వహిస్తున్న యూనిఫాం కుట్టు కేంద్రాన్ని డీఆర్డీఏ పీడీ శ్రీనివాస్‌తో కలిసి కలెక్టర్ శనివారం పరిశీలించారు. మహిళా సంఘాలకు ఆర్థిక భరోసా కల్పించాలనే ఉద్దేశంతో యూనిఫాం దుస్తుల కుట్టు పనిని అప్ప గించామన్నారు. పనిలో నాణ్యతా ప్రమాణాలను పాటించి, గడువులోగా అందించాలని సూచించారు. ఆయన వెంట సీసీలు భీమా, సాంబయ్య తదితరులు ఉన్నారు.

బ్యారేజీలో కొనసాగుతున్న పరీక్షలు

మహదేవపూర్, జూన్ 29: భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం బ్యారేజీ వద్ద సెంటర్ వాటర్ పవర్ స్టేషన్ రీసెర్చ్ నిపుణులు చేస్తున్న పరీక్షలు కొనసాగుతున్నాయి. తొమ్మిదో రోజైన శనివారం అధికారులు బ్యారేజీలోని వివిధ ప్రాంతాల్లో భూపొరల్లోకి డ్రిల్లింగ్ చేసి సాంద్రత, స్థిరత్వంపై అధ్యయనం చేశారు.

ఉద్యోగ విరమణ సహజం : ఎస్పీ కిరణ్ ఖరే

కృష్ణకాలనీ (భూపాలపల్లి), జూన్ 29: రిటైర్మెంట్ అనేది సహజమని, ప్రతి ఉద్యోగికీ ఇది తప్పదని ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్సై ఎస్ఎస్ఆర్‌వీ ప్రసాద్ ఉద్యోగ విరమణ పొందగా శనివారం ఆయన్ను, ఆయన సతీమణిని సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గౌరవంగా ఉద్యోగ విరమణ పొందడం ఎంతో అదృష్టంగా భావించాలన్నారు. కుటుంబానికి దూరంగా ఉంటూ ప్రజలకు సేవలందించడం గర్వకారణమన్నారు. సర్వీస్ పూర్తి చేసిన ప్రసాద్ సేవలు భవిష్యత్ తరాలకు ఎంతో స్ఫూర్తిదాయమని కొనియాడారు. భవిష్యత్తులో ఏదైనా ఇబ్బందులు ఎదురైతే తనను నేరుగా కలిస్తే పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావు, చిట్యాల సీఐ మల్లేష్ యాదవ్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శ్రీకాంత్, రత్నం, పోలీసు అధికారుల సంఘం నేత యాదిరెడ్డి, ఏఎస్సై ప్రతాపరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కుసుమ జగదీశ్‌కు ఘన నివాళులు


కుసుమ జగదీశ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

ములుగు రూరల్ జూన్ 29: దివంగత జడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ ప్రథమ వర్ధంతి ఆయన స్వగ్రామం మల్లంపల్లిలో శనివారం జరిగింది. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తెలంగాణ ఉద్యమకారులు, ప్రజా సంఘాల నేతలు ఈ కార్యక్రమానికి భారీ సంఖ్యలో హాజరయ్యారు. శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, ములుగు జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతితోపాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. జగదీశ్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని, ఉద్యమం నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.

గోవిందరావుపేటలో..

గోవిందరావుపేట: దివంగత జడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్ వర్ధంతిని మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. ఈసందర్భంగా జగదీశ్ చిత్రపటానికి ఎంపీపీ సూడి శ్రీనివాసరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు లకావత్ నర్సింహనాయక్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమానికి జీవితాన్ని అర్పించిన గొప్ప వ్యక్తి జగదీశ్ అని, ములుగు జిల్లా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిన్నింటి మధుసూదన్‌రెడ్డి, అక్కినపల్లి రమేష్, బాబర్, పృథ్వీరాజ్, హేమాద్రి, వాగా, పూర్ణచందర్, మధు, మోహన్, బత్తుల రాణి, బైకని ఓదెలు, కొండి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

(5వ పేజీ తరువాయి)

పనితీరు, ప్రభుత్వ పథకాల అమలుపై చర్చ జరిగింది. పలు సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. అధికారుల తీరుపై పలువురు అసహనం వ్యక్తం చేశారు. ఎక్సైజ్ శాఖ వివరాలను సూపరింటెండెంట్ శ్రీనివాస్ వెల్లడిస్తున్న క్రమంలో చిట్యాల, టేకుమట్ల జడ్పీటీసీలు గొర్రె సాగర్, పులి తిరుపతిరెడ్డి కల్పించుకొని రెండు మండలాల్లో మద్యం దందా జోరుగా సాగుతోందన్నారు. ఒక మద్యం షాపును ఏకంగా బెల్టు షాపులకు తరలించేందుకు ఏర్పాటు చేసుకున్నారని, ఇష్టానుసార ధరలకు అమ్ముతున్నారని ఆరోపించారు. నిర్వాహకులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. జడ్పీ వైస్ చైర్‌పర్సన్ జోక్యం చేసుకొని మద్యం అధిక ధరలను నియంత్రించడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. మూగజీవాలు మృతి చెందితే వచ్చే ఇనురెన్స్ డబ్బులను సకాలంలో అందేలా పశు సంవర్ధక, విద్యుత్ శాఖల అధికారులు కృషి చేయాలన్నారు. ఖరీఫ్ సాగుపై రైతుల్లో నెలకొన్న సందేహాలను వ్యవసాయ, ఉద్యన శాఖల అధికారులు నివృత్తి చేయాలన్నారు. విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ అభివృద్ధి పనులకు ఉపయోగించేందుకు తరలిస్తున్న మట్టిని అటవీశాఖ అధికారులు ఉద్దేశపూర్వకంగానే అడ్డుకుంటున్నారని సభ దృష్టికి తెచ్చారు. మట్టిని వెలికి తీసే భూమి అటవీ శాఖది కానప్పుడు అడ్డుకోవద్దన్నారు. జూలై 4న పదవీ కాలం ముగుస్తున్న నేపథ్యంలో జడ్పీటీసీలను సీఈవో సన్మానించారు.

ఒకే భవనంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల నిర్వహణ విడ్డూరం

● ఏబీవీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ రాజ్‌కుమార్

రేగొండ, జూన్ 29: ఒకే బిల్డింగ్‌లో ఎంజేపీ పాఠశాల, ప్రైవేటు పాఠశాల నిర్వహించడం విడ్డూరమని ఏబీవీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ రాజ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంజేపీ పాఠశాలను ఆయన శనివారం సదర్శించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలలకు వ్యతిరేకంగా గ్యాలరీ ఏర్పాటు చేసి ప్రచారం చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అసంపూర్తిగా తలుపులు లేని భవనంలో పాఠశాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల్, రాజు తదితరులు పాల్గొన్నారు.